నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా బుధవారం 11కేవీ ఎల్ఐసీ కాలనీ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఆస్మాన్‌ఘడ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

చెత్తను ఎత్తేశారు..!



కుంట్లూర్ సన్‌రైజ్ కాలనీ వద్ద చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులో చెత్త కుప్పలను శానిటేషన్ సిబ్బంది మంగళవారం ఉదయం తొలగించారు. ఆయా వార్డుల్లో పేరుకుపోయిన చెత్త కుప్పల వ్యర్థాల సమస్యపై మున్సిపాలిటీలో 'చెత్త' నిర్వహణ అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించిన మున్సిపల్ అధికారులు.. కమిషనర్ రవీందర్‌రెడ్డి ఆదేశాలతో ఉదయం శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బందితో పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. అనంతరం అక్కడ బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని శానిటేషన్ సిబ్బందిని హెచ్చరించారు. చెత్త కుప్పలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు.

చెరువుల సంరక్షణ అందరి బాధ్యత: కార్పొరేటర్

మన్సూరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెరువుల సంరక్షణ అందరి బాధ్యత అని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్‌యాదవ్ అన్నారు. ఫత్తుల్లాగూడ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెరువు సంరక్షణపై అధికారులు ప్రత్యేక డ్రైవ్‌ను మంగళవారం చేపట్టారు. పనులను కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. భూగర్భ జలాల పెరుగుదలలో చెరువులు ఎంతగానో దోహదపడతాయని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెరువు చుట్టూ చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు వేయకుండా శుభ్రతకు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, అధికారులు మాధవరెడ్డి, రవీందర్ రెడ్డి, సూపర్‌వైజర్ జనార్దన్, సిబ్బంది, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువ పనుల్లో వేగం పెంచండి

- కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఎల్ కాలనీలో వరదనీటి కాలువ పనులు వేగవంతం చేయాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎస్ఆర్ఎల్ కాలనీలో సుమారు రూ.5కోట్లతో చేపట్టిన వరదనీటి కాలువ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. పనులు వారం రోజులుగా మందకొడిగా జరుగుతుండడంపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పవన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్‌కుమార్, మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

- సీపీఐ మండల కార్యదర్శి హరిసింగ్‌నాయక్

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇటీవల చేసిన డ్రైనేజీ మరమ్మతు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరిసింగ్‌నాయక్ మాట్లాడుతూ, కాలనీలో డ్రైనేజీ పైపులైన్ పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. పైపులైన్ చిన్నదిగా ఉండడంతో నిత్యం సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. ఈ విషయాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, రమేష్‌నాయక్, భిక్షపతి, నర్సయ్య పాల్గొన్నారు.


షెడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

- జీహెచ్ఎంసీ చార్మినార్ జడ్సీకి కార్పొరేటర్ వినతి

చాదర్‌ఘాట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు రూ.3కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె ముసారాంబాగ్‌లోని శ్రీదుర్గా రాజరాజేశ్వరీ దేవాలయం ముందు రూ.5లక్షల నిధులతో నిర్మిస్తున్న షెడ్ పనులను ఆలయ కమిటీ ప్రతినిధులు జంగారెడ్డి, కృష్ణాగౌడ్, విశాల్‌లతో కలిసి పరిశీలించారు. పలు అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదించిన రూ.3కోట్ల నిధులతో చేపట్టే పనులకు గాను టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని స్వయంగా కలిసి విన్నవించారు. షెడ్ నిర్మాణం పూర్తికాగానే వీధి దీపాల ఏర్పాటును కూడా పూర్తి చేస్తానని ఆమె హామీనిచ్చారు. జీహెచ్ఎంసీ ఏఈ శరత్‌రెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, స్ట్రీట్ లైట్స్ లైన్‌మెన్ దుర్గారావు, సురేష్, బీజేపీ నాయకులు దినేశ్, ఉమేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


దిల్‌సుఖ్‌నగర్‌లో డాగ్ స్క్వాడ్‌తో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చాదర్‌ఘాట్, మలక్‌పేటలో పోలీసుల తనిఖీలు

చాదర్‌ఘాట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన భారీ పేలుళ్ల నేపథ్యంలో చాదర్‌ఘాట్, మలక్‌పేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట తదితర ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ కేబీ మురారీతో కూడిన పోలీసుల బృందాలు కార్లను, ద్విచక్రవాహనాలను తనిఖీలు చేశాయి. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో, ముసారాంబాగ్ చౌరస్తా, ముసారాంబాగ్ బ్రిడ్జి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మలక్‌పేట డివిజన్ ఏసీపీ సుబ్బిరామిరెడ్డి పోలీసుల తనిఖీలను పరిశీలించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని మైఫిల్ హోటల్ ముందున్న పార్కింగ్ స్థలంలో పార్క్ చేసిన వాహనాలను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. మలక్‌పేట అదనపు ఇన్‌స్పెక్టర్ జయశంకర్, ఎస్ఐ సంజీవరెడ్డితో కూడిన పోలీసుల బృందం వాహనాలను అనుమానస్పద వ్యక్తులను తనిఖీలు చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా అనుమానస్పద కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



బీటీ రోడ్డుకు మట్టితో మరమ్మతులు చేస్తున్న దృశ్యం


రోడ్డుపై కంకర పోయడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అతుకుల బొంత.. అల్మాస్‌గూడ రోడ్డు!

- బీటీ రోడ్డుకు మట్టితో మరమ్మతులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సరూర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీటీ రోడ్డులో ఏర్పడిన గుంతలకు మట్టితో మరమ్మతులు చేయడం ఎక్కడైనా చూశారా?.. అలాంటి విచిత్రం చూడాలంటే అల్మాస్‌గూడకు రావాల్సిందే! బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ-గుర్రంగూడ గ్రామాలను కలిపే లింకు రోడ్డును 2021లో చక్కని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఆ తర్వాత 'వంతుల వారీగా' అన్నట్టు వాటర్ వర్క్స్ అధికారులు ఓసారి.. మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు మరోసారి.. స్థానిక నిర్మాణదారులు తమ ఇళ్లలోకి వాటర్, డ్రైనేజీ కనెక్షన్ కోసమంటూ ఇంకోసారి పలుదఫాలుగా... ఇలా ఎవరి ఇష్టమొచ్చినట్టు వారు అడ్డదిడ్డంగా తవ్వుకుంటూ పోవడంతో రహదారి మొత్తం గుంతలమయంగా మారింది. రాజీవ్ గృహకల్ప సమీపంలోని వైఎస్ఆర్ పార్క్ నుంచి మొదలుకుని గుర్రంగూడ మలుపు వద్ద గల శివాలయం వరకు దాదాపు 50కి పైగా గుంతలు ఉన్నాయంటే ఈ రోడ్డు దుస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.


2021లో అల్మాస్‌గూడ-గుర్రంగూడ రోడ్డును అభివృద్ధి చేసినప్పటి చిత్రం (ఫైల్)

మట్టితో మరమ్మతులా..?

ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డులోని గుంతలు వాన నీటితో నిండి పోయి మడుగులను తలపించాయి. ప్రస్తుతం వర్షాలు ఆగిపోవడంతో మునిసిపల్ అధికారులు బీటీ రోడ్డులోని సదరు గుంతలకు మట్టితో మరమ్మతులు చేయించారు. ఇది చూసిన స్థానికులు హవ్వ.. బీటీ రోడ్డుకు మట్టితో మరమ్మతులా? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. బడంగ్‌పేట్ ఇంజనీరింగ్ అధికారులు ఇలా కొత్త పద్ధతి కనిపెట్టారేమో అని ప్రజలు కామెంట్ చేస్తున్నారు. రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనట్టు చెబుతున్నా ఆ దిశగా ముందడుగు మాత్రం పడడం లేదు. పాలకుల వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంధకారంలో..

అసలే గుంతల రోడ్డు.. ఆపై కానరాని విద్యుత్ లైట్లు.. ఇంకేముంది అల్మాస్‌గూడ-గుర్రంగూడ రహదారిలో రాత్రి వేళ ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. అల్మాస్‌గూడ నుంచి శివాలయం మలుపు వరకు విద్యుత్ లైట్లు ఉండగా.. అక్కడి నుంచి గుర్రంగూడ వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారం అలుముకుంటోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి అల్మాస్‌గూడ-గుర్రంగూడ రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని, గుర్రంగూడ వైపు వెంటనే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తూతూ మంత్రంగా మరమ్మతులు



అల్మాస్‌గూడ-గుర్రంగూడ రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. లోతైన గుంతలను జేసీబీ సాయంతో మట్టితో పూడ్చమేంటో అధికారులకే తెలియాలి. డస్ట్ కానీ, చిన్న సైజు కంకర(బేబీ చిప్స్)గానీ గుంతల్లో పోస్తే ఫలితం ఉంటుంది. మట్టితో పూడిస్తే ఎన్ని రోజులు ఉంటుంది?అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రజాధనం వృథా తప్ప ప్రయోజనం ఉండదు. ఇప్పటికైనా అధికారులు తమ ధోరణి మార్చుకుని మట్టితో తూతూ మంత్రంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చర్యలు చేపట్టాలి.

- శూరకర్ణారెడ్డి, అల్మాస్‌గూడ, స్థానికుడు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: ఏసీపీ కృష్ణయ్య

మన్సూరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి పాటు పడాలని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యగౌడ్ పేర్కొన్నారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ పరిధి సూర్యోదయకాలనీలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ గర్ల్స్ జూనియర్ కళాశాలలో మంగళవారం మైనారిటీస్ వెల్ఫేర్‌డే, జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ కృష్ణయ్య విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వాలు విద్యకు అనేక ప్రాధాన్యత నిస్తూ ఉన్నత విద్యనభ్యసించేందుకు పేద విద్యార్థులకు ఎన్నో వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నాయని, వీటిని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సైబర్ నేరాలు, మహిళల పట్ల దాడులు, వివక్షతపై జాగ్రత్తలు వహించాలని, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉంటూ జీవితాలను గొప్పగా మలచుకోవాలని ఏసీపీ కృష్ణయ్య విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐపీ శేఖర్ రెడ్డి, సైబర్ క్రైం సిబ్బంది మహేష్‌గౌడ్, వైష్ణవి, పల్లవి, కళాశాల ప్రిన్సిపాల్ అర్చన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యగౌడ్


అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

అందెశ్రీకి నివాళి

హయత్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజా కవి అందెశ్రీ మృతి చెందడంతో తుర్కయంజాల్ చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాసిన పాటలను గుర్తు చేశారు. తెలంగాణ సమాజం అందెశ్రీని ఎప్పటికీ మరువదని వారు అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకుడు పట్నం రమేష్‌కురుమ, నాయకులు రాజు, రవికుమార్, రమణ, నరసింహ, వెంకటేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయులుకు ధన్వంతరి అచీవర్స్ అవార్డు

వనస్థలిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజికవేత్త, కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్విని ఆంజనేయులు ధన్వంతరి అచీవర్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు అవార్డును ధన్వంతరి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఆయనకు అందజేశారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాలుగా అనాథలకు ఉచిత హెయిర్ కటింగ్, అన్నదానం, పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని తెలిపారు. తన సేవలను గుర్తించి అవార్డు అందజేసిన ధన్వంతరి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నర్సింహరావు, స్వామి, మురళీధర్, రత్నకుమార్, లీలాకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

లిఫ్టులో ఇరుక్కున్న జొమాటో డెలివరీ బాయ్

- కాపాడిన చాదర్‌ఘాట్ పోలీసులు


రాంబాబును కాపాడిన పోలీసులు

చాదర్‌ఘాట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఫుడ్ డెలివరీ చేయడానికి వచ్చిన జొమాటో డెలివరీ బాయ్ మంగళవారం రాత్రి ఓ అపార్టుమెంట్‌లోని లిఫ్టులో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు అతణ్ని కాపాడారు. చాదర్‌ఘాట్ సీఐ కేబీ మురారి తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ నివాసి చెరుకు మల్లె రాంబాబు జొమాటో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. మలక్‌పేట ప్రొఫెసర్ కాలనీలోని ఓ రెసిడెన్సీలోని ఫ్లాట్‌లో ఫుడ్ డెలివరీ చేసేందుకు వచ్చాడు. డెలివరీ చేసిన తర్వాత లిఫ్టులో కిందికి దిగేందుకు ప్రయత్నించగా లిఫ్టు ఆగిపోయింది. దీంతో ఆయన డయల్ 100కు కాల్ చేశాడు. సమాచారం అందుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. లిఫ్టు తలుపులు పగలగొట్టి జొమాటో డెలివరీ బాయ్ రాంబాబును బయటికి తీశారు. పోలీసులకు రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

చాదర్‌ఘాట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాజీ తెలిపారు. ముసారాంబాగ్‌లోని ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, శాలివాహననగర్ కాలనీలో విద్యుత్ అధికారులు మంగళవారం ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. టీజీఎస్పీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాజీ, ఎస్ఈ సౌత్ సర్కిల్ శ్రీనివాసులు, ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీఈ వినోద్‌రెడ్డి, ముసారాంబాగ్ సెక్షన్ ఏఈ నరేందర్ పాల్గొన్నారు. మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నామన్నారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు

- భర్త ఆత్మహత్య


కిరణ్‌కుమార్ (ఫైల్)

వనస్థలిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం అరుంధతిపేట గ్రామానికి చెందిన యార్లగడ్డ కిరణ్‌కుమార్(33) భార్యతో కలిసి వనస్థలిపురం ఏ టైప్ క్వార్టర్స్‌లో నివాసముంటూ రామోజీఫిలిం సిటీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగ కొంతకాలంగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి భార్య ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సమయంలో కిరణ్‌కుమార్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ సిటిజన్స్ నూతన కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలో మంగళవారం రంగారెడ్డి జిల్లా సీనియర్ సిటిజన్స్ (టస్కా) నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చీమర్ల కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామ్‌నాథ్, కోశాధికారిగా సత్తయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా రాంప్రసాద్, రంగయ్యచౌదరి, డా.పాండుగౌడ్, సంయుక్త కార్యదర్శులుగా అమృతారెడ్డి, మంగేష్, మణిపాల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కృష్ణారెడ్డి, శివరాంరెడ్డి, సభ్యులుగా స్వతంత్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఓబులేసు, ఆనంద్‌రెడ్డి, రామచంద్రారావు, బాలకృష్ణయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు కృషి చేసిన సభ్యులకు వారు ధన్యవాదాలు తెలిపారు.


బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని స్వామి వివేకానంద పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్‌ను మంగళవారం జీహెచ్ఎంసీ శానిటేషన్ డీఈ నీలిమతో కలిసి ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

- వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

బీసీ ఉద్యమం మరింత బలోపేతం

వనస్థలిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యమాన్ని మరింతగా బలోపేతం చేస్తామని బీసీ జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎల్బీనగర్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ బీసీ జేఏసీ చైర్మన్ దుస్సా యాదగిరి మాట్లాడారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు. అన్ని కులాల వారిని సమన్వయం చేసుకుని బీసీలకు న్యాయంగా దక్కాల్సిన రిజర్వేషన్లు సాధించడానికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మయాదవ్, రఘురామ్‌నేత, వేములయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, రాజు, కేవీగౌడ్, సత్యం, వెంకన్ననేత, ఉపేంద్రయాదవ్, సంతోష్‌చారి, శ్యాంసుందర్ గౌడ్, లింగేష్‌యాదవ్, కొండల్‌గౌడ్, పుష్పలీల, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


బీసీ జేఏసీ ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న నాయకులు

రేపు కబడ్డీ జట్ల ఎంపిక

ఎల్బీనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు ఈ నెల 13 గురువారం రోజున నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ, సరూర్‌నగర్ స్టేడియంలో కబడ్డీ జట్ల ఎంపిక ఉంటుందని, ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 5 నుంచి 7 వరకు మహబూబ్‌నగర్‌లో జరుగనున్న 51వ అంతర్ జిల్లా జూనియర్ కబడ్డీ పోటీలలో రంగారెడ్డి జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని వారు తెలిపారు. 2006 జనవరి 18 తరువాత పుట్టి 75 కేజీలలోపు ఉన్న బాలురు, 29 డిసెంబర్ 2005 తరువాత పుట్టి 65 కేజీల లోపు ఉన్న బాలికలు అర్హులని వారు చెప్పారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు చంద్రమోహన్ (7661992581), రాజు (9000038272)లలో సంప్రదించాలని వారు సూచించారు.


కొత్తపేట విద్యుత్ సెక్షన్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న సిబ్బంది

విద్యుత్ సిబ్బందిపై పోలీసుల దౌర్జన్యం!

- ఎల్బీనగర్ డీసీపీకి ఫిర్యాదు

చాదర్‌ఘాట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బందిపై చైతన్యపురి పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ మంగళవారం ఆందోళన నిర్వహించారు. చైతన్యపురి పోలీసులు పట్టుకున్న గంజాయి కేసుకు సంబంధించిన సాక్ష్యం కోసం సంతకాలు చేయాలంటూ విద్యుత్ సిబ్బందిపై ఒత్తిడి చేశారని వారు ఆరోపించారు. ఈ మేరకు కొత్తపేట విద్యుత్ సెక్షన్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎల్బీనగర్ డీసీపీ అనురాధను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బందిపై పోలీసులు భౌతిక దాడులకు పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైనాయని వివరిస్తూ వాటిని డీసీపీకి స్వయంగా చూపించారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు చేపడతానని డీసీపీ హామీనివ్వడంతో విద్యుత్ సిబ్బంది ఆందోళన విరమించారు.

యువకుడి అదృశ్యం

చంపాపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వెళ్లివస్తానని చెప్పిన యువకుడు తిరిగి ఇంటికి రాలేదు. హఫీజ్‌బాబానగర్‌కు చెందిన సమీర్‌హమ్మద్(27)అనే యువకుడు ఈ నెల 10న మధ్యాహ్నం అనారోగ్యంగా ఉందని, ఆస్పత్రికి వెళ్లి ఇంజక్షన్ తీసుకొని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాలలో వెతికారు. అయినా అతని ఆచూకీ లభించలేదు. మంగళవారం సమీర్‌హమ్మద్ తల్లీ రిజ్వాన్‌బేగం కంచన్‌బాగ్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమల్‌కుమార్ తెలిపారు.

మెడికల్ రిప్రజెంటేటివ్ మత్తు దందా

- ఆల్ప్రాజోలం, దగ్గుమందు సిరప్ విక్రయం
- అరెస్ట్ చేసిన ఎక్సైజ్ అధికారులు


నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న నిషేధిత ఆల్ప్రాజోలం, దగ్గుమందును చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి అడ్డదారిలో మత్తును కలిగించే మందులను విక్రయిస్తుండగా... నిఘా పెట్టిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మత్తును కలిగించే ఆల్ప్రాజోలం టాబ్లెట్లతో పాటు చిన్న పిల్లల దగ్గుమందు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. హయత్‌నగర్ మునుగనూర్ గ్రామానికి చెందిన జల్ల నరేష్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఉన్న అనుభవంతో డ్రగ్స్ కంట్రోల్ ఆఫ్ ఇండియా నిషేధించిన చిన్న పిల్లల దగ్గుమందు సీసాలు, మాదకద్రవ్యాల కింద పరిగణించే ఆల్ప్రాజోలం టాబ్లెట్లను ఇంట్లో నిల్వ ఉంచాడు. అవసరమైన కస్టమర్లకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. అతడి దందాపై పక్కా సమాచారమందుకున్న రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్‌కిరణ్, సీఐ సుభాష్‌చందర్, ఎస్ఐ అఖిల్‌ల బృందం అతడిపై నిఘా పెట్టింది. మత్తుమాత్రలు విక్రయిస్తున్నాడన్న పక్కాసమాచారంతో అతని ఇంటిపై దాడిచేసి 714 చిన్నపిల్లల దగ్గుమందు సీసాలు, 130 ఆల్ప్రాజోలం టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న మందులను హయత్‌నగర్ ఎక్సైజ్ పీఎస్‌లో అప్పగించారు.

తాళం వేసిన ఇంట్లో ల్యాప్‌టాప్ చోరీ

చంపాపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పండుగకు ఊరెళ్లి తిరగొచ్చే సరికి ఇంట్లోని ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. కంచన్‌బాగ్ డీఆర్‌డీవో టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న డీఆర్‌డీఎల్ ఉద్యోగి ముకరాజ్ మీనా(35) గత నెల 18న కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగకు స్వస్థలం రాజస్థాన్‌కు వెళ్లారు. తిరిగి ఈ నెల 9న ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు తీసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి ముకరాజ్‌మీనా పరిశీలించగా తన వ్యక్తిగత ల్యాప్‌టాప్ కనిపించలేదు. మంగళవారం బాధితుడు కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు.